క్లుప్తంగా

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన శిరీష్



శిరీష్‌ను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన మిండగుదటి శిరీష్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో ఉన్న మంత్రి విశ్వరూప్‌ను శిరీష్ కలిసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శిరీష్‌ను మంత్రి విశ్వరూప్ సత్కరించి అభినందించారు. జిల్లాలోని విద్యార్థులతో మమేకమై వారి సమస్యలపై శ్రద్ధ చూపాలని శిరీష్‌కు సూచించారు. కార్యక్రమంలో అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవుదూడకు శస్త్ర చికిత్స



ఆవు దూడకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యురాలు పద్మజ

ముమ్మిడివరం: ముమ్మిడివరం గాంధీ బొమ్మ సెంటర్‌లో బుధవారం తెల్లవారుజామున రోడ్డుపై పడుకున్న ఆవుదూడను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. అది చూసిన స్థానిక హోటల్ వ్యాపారి ఎ.వెంకట కృష్ణ 1962కు ఫోన్ చేయడంతో వైఎస్సార్ సంచార వైద్య అంబులెన్స్ హుటాహుటిన అక్కడకు చేరుకుంది. అంబులెన్స్ వైద్యురాలు సీహెచ్ పద్మజ ఆవుదూడకు అత్యవసర చికిత్స అందించారు. దూడ స్పృహలోకి రావడంతో దాన్ని అంబులెన్స్‌లో యజమాని ఇంటికి తరలించి అక్కడ శస్త్రచికిత్స చేశారు.

135 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్



పట్టుకున్న మద్యం సీసాలతో నిందితుడు తాతారావు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతి పురం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 135 మద్యం సీసాలతో బొమ్మిడి తాతారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాళ్లరేవు స్టేషన్ సీఐ జేవీ భవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎం.లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ డి.శ్రీనివాసరావు, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు



వేంకటేశ్వరునికి అష్టదళపాదపద్మారాధన నిర్వహిస్తున్న వేదపండితులు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి అండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం స్వామికి అష్టదళ పాద పద్మారాధన వైభవంగా నిర్వహించారు. తొలుత బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని తిరుచ్చి వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు.

తప్పెవరిది..? శిక్ష ఎవరికి..?

- కాగితాలకే పరిమితమైన ప్లాస్టిక్ నిషేధం
- మున్సిపల్ డ్రైయిన్లు, పంట కాల్వల్లోను ప్లాస్టిక్ వ్యర్థాలే
- భావితరాలకు శాపంగా మారిన విచ్చలవిడి వినియోగం



ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెం పంట కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



కుమ్మరికాలువ డ్రైయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అమలాపురం టౌన్/అల్లవరం: తెల్లారిలేస్తే ప్లాస్టిక్ సీసాలో నీళ్లు తాగుతున్నాం.. సూపర్‌మార్కెట్ నుంచి నిత్యావసర సరకులు, మార్కెట్ నుంచి కూరగాయలు ప్లాస్టిక్ కవర్లతోనే తెచ్చుకుంటున్నాం. మద్యం షాపుల వద్ద నిత్యం వేలల్లో ప్లాస్టిక్ గ్లాసులు వాడి పాడేస్తున్నారు. పుట్టినరోజు నుంచి చావు వరకూ అన్ని కార్యక్రమాల్లో ప్లాస్టిక్‌తో తయారుచేసిన కవర్లు, గ్లాసులు, భోజనం ప్లేట్లు వాడుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి జీవితంలో ప్లాస్టిక్ అన్నది నిత్యావసర వస్తువుగా మారిపోయింది. అందుకే చుట్టూ ఎటు చూసినా ప్లాస్టిక్ డ్రైయిన్లు, ప్లాస్టిక్ పంట కాలువలు కనిపిస్తున్నాయి.

నిషేధమా.. అదెక్కడ..?

అమలాపురం మున్సిపాలిటీకి చెందిన డంపింగ్‌యార్డులో సుమారు 30,000 టన్నుల చెత్త పోగయ్యింది. ఆ చెత్తను వేరు చేస్తే దాంట్లో కనీసం 5,000 టన్నులైనా ప్లాస్టిక్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 125 మైక్రాన్ల మందం కంటే తక్కువున్న ప్లాస్టిక్ కవర్లు, వస్తువులేవీ వాడకూడదని గతేడాది డిసెంబరు 22వ తేదీన ప్రభుత్వం మార్గనిర్దేశకాలు జారీచేసింది. కాని అవెక్కడా అమలు కావడం లేదు. నిషేధిత ప్లాస్టిక్ తయారీ, విక్రయాన్ని ఆపలేకపోవడం సమస్యకు ప్రధాన కారణంగా కనిపిస్తుంది. అమలాపురం మున్సిపాలిటీతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీలోను నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అమ్మేవారిపై నిఘా ఉంచి భారీగా జరిమానాలు వేయడంతో అమ్మకాలు కొద్దికాలం తగ్గుముఖం పట్టాయి. తరువాత షరా మామూలైపోవడమే కాదు నిషేధమన్నది కేవలం కాగితాలకే పరిమితమైపోయింది.

ప్లాస్టిక్ కాలువలు.. ప్లాస్టిక్ డ్రైయిన్లు

ప్రజలు విచ్చలవిడిగా వాడి పాడేసిన కవర్లతో ప్రకృతి వనరులన్నీ కలుషితమవుతున్నాయి. అమలాపురం మున్సిపాలిటీలో రోజుకు 35 టన్నుల చెత్తను ఊడ్చితే అందులో ఒక టన్నుకి పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. మరో టన్నున్నర ప్లాస్టిక్ సీసాలు, ప్యాకెట్లు, కవర్లు రోడ్ల చెంత పారే డ్రైయిన్లను ముంచేస్తున్నాయి. దీనివల్లే అమలాపురం మున్సిపాలిటీలో 153 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న అన్ని రకాల డ్రైయిన్లలో పైన మురుగు నీరు కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తాయి. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువలు దాదాపు 55 కిలోమీటర్లు, అనుసంధాన పిల్ల కాలువలు 250 కిలోమీటర్ల మేర పారుతున్నాయి. ఈ పంట కాల్వలు, గ్రామాల్లోని డ్రైయిన్లు డస్ట్ బిన్‌ల్లా తయారయ్యాయి. కాల్వల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రవహించి లాకులు, స్లూయిస్‌ల వద్ద అడ్డుపడి అటు ప్రవాహాన్ని అడ్డుకోవడమే కాకుండా కాలుష్యానికి కారణమవుతున్నాయి. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకంతో భావితరాలకు శాపంగా మారుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా అంతమొందించేందుకు మున్సిపాలిటీలు, పంచాయతీల ఆధ్వర్యంలో నిరంతర నిఘా, పర్యవేక్షణతో పాటు అధికారులు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరమూ ఎంతైనా ఉంది. అంతేకాదు ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపేస్తేనే భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించినవారమవుతాం.

> **అవగాహనతోనే అదుపునకు ప్రయత్నిస్తున్నాం**
>
> మున్సిపల్ డ్రైయిన్లలో శీతల పానీయాల ప్లాస్టిక్ సీసాలు, వివిధ వస్తువుల ప్లాస్టిక్ ప్యాకింగ్‌లు, కవర్లు ఎక్కువగా వస్తున్నాయి. వీలు ఉన్నప్పుడల్లా ప్రజలకు ఈ తప్పిదంపై అవగాహన కల్పిస్తున్నాం. అవగాహనతోనే ఈ తప్పిదాన్ని అదుపు చేయగలం. ప్లాస్టిక్ సీసాలు, వస్తువుల తయారీ ఆగితేనే ఇలాంటి ప్రతికూల పరిస్థితులు అదుపులోకి వస్తాయి.
>
> – ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి



మంత్రి విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షిని సత్కరిస్తున్న మెప్మా ప్రతినిధులు



డీఈవో కమలకుమారిని సత్కరిస్తున్న ఎస్టీయూ జిల్లా మహిళా ఉపాధ్యాయులు



మహిళా అధికారులను అభినందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్



టి.కొత్తపల్లి ఆసుపత్రిలో మహిళలకు పండ్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

- ఘనంగా మహిళా దినోత్సవం
- మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని వక్తల పిలుపు

అమలాపురం టౌన్: మహిళాభ్యున్నతి కోసం మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛందసంస్థల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక మెప్మా భవనంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి, మీనాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పినిపే బేబీ మీనాక్షి హాజరై కేక్‌ను కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మెప్మాకు చెందిన మహిళలు బేబీ మీనాక్షిని సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డీఈవో ఎం.కమలకుమారి పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోనసీమకు చెందిన మహిళా దంత వైద్యులు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ముమ్మిడివరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ నియోజకవర్గ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహం వద్ద నియోజకవర్గ మహిళా నేతలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర ప్రసాద్ మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ లక్ష్మీనారాయణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కె.తులసి, ఏపీడీ ఎంఎం జిలాని తదితరులు పాల్గొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

యానాం: స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో మహిళా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లోను అభివృద్ధి చెందడం ద్వారా ఆయా కుటుంబాలు సైతం అభివృద్ధి బాటలో పయనిస్తాయన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు, వంటల పోటీలను నిర్వహించారు. స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిజిటల్ ఇన్నోవేషన్స్ అండ్ టెక్నాలజీ ఆఫ్ ఫర్ జెండర్ ఈక్వాలిటీ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.రవి శంకర్ ఆధ్వర్యంలో హెల్దీ ఉమెన్ హెల్దీ ఇండియా నినాదంతో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్‌ఏఓ మునిస్వామి ప్రారంభించారు.

తాళ్లరేవు: చొల్లంగి పంచాయతీ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో కోవిడ్ సమయంలో సేవలందించిన వైద్య సిబ్బంది ఎస్.గౌతమి, కె.తనూజ, ఎ.మహాలక్ష్మి, బి.మంగాయమ్మలను దుశ్శాలువాలతో సత్కరించారు.

ఉప్పలగుప్తం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో గొల్లవిల్లి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గను కార్యాలయ సిబ్బంది, వలంటీర్లు దుశ్శాలువాతో సత్కరించారు. భీమనపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారిని లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో మహిళా సిబ్బందిని సత్కరించి అభినందించారు.

ఐ.పోలవరం: మురమళ్లలో విశ్వజన కళా మండలి ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో హిత కారిణి సమాజ చైర్మన్ కాశి బాల మునికుమారి, ఎంపీపీ మెర్ల రాణి మిరియం జ్యోతి, కొమరగిరి సర్పంచ్ వరలక్ష్మి, డాక్టర్ రాజకుమారి, దడాల స్వర్ణలతలను సత్కరించారు. టి.కొత్తపల్లి సీహెచ్‌సీలో జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మహిళా శానిటరీ వర్కర్స్‌కు హైజనిక్ కిట్స్, ఆసుపత్రిలో ఉన్న రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్‌లను రెడ్‌క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైస్ చైర్మన్ పిన్నంరాజు శ్రీనివాసరాజు అందజేశారు.

అమలాపురం రూరల్: ప్రస్తుతం మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమలాపురం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఐదుగురు ఉత్తమ మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు.

ఆడపిల్లగా పుట్టినందుకు ప్రతి స్త్రీ గర్వపడాలి

అల్లవరం: ఆడపిల్లగా పుట్టినందుకు ప్రతి స్త్రీ గర్వపడాలని జిల్లా అడిషనల్ జడ్జి వి.నరేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా చట్టాలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అమలాపురం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ హిమబిందు తదితరులు హాజరయ్యారు.



యానాంలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి



మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న జిల్లా రవాణా అధికారి నాగేశ్వరరావు



గొల్లవిల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ను సత్కరిస్తున్న సిబ్బంది, వలంటీర్లు



చొల్లంగిలో మహిళా కోవిడ్ వారియర్లను సత్కరిస్తున్న స్థానిక నేతలు

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత



బండారులంకలో కూల్‌డ్రింక్‌లను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్

అమలాపురం రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రుణాలు అందించి చేయూతనిస్తుందని డీఆర్‌డీఏ పీడీ.డాక్టర్ శివ శంకర్ ప్రసాద్ అన్నారు. బండారులంకలో విజయదుర్గ మహిళా శక్తి సంఘం నిర్వహిస్తున్న జ్యూసీ కూల్‌డ్రింక్ సంస్థలో నూతనంగా కొనుగోలు చేసిన తయారీ యంత్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. జ్యూసీ కూల్‌డ్రింక్ సంస్థకు హైరాడార్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకంలో భాగంగా మంజూరైన రూ.10 లక్షల రుణంతో యంత్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ యంత్రాలను ప్రారంభించి కూల్‌డ్రింక్ తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రయంలో ఎల్.లక్ష్మీనారాయణ, హార్టికల్చర్ జేడీ మల్లికార్జున్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కిమ్స్ హాస్పిటల్‌లో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో బుధవారం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అలాగే నామకరణలు, అన్నప్రాశనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

చైతన్య ప్రభు ఆవిర్భావ మహోత్సవం

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో బుధవారం శ్రీచైతన్యమహాప్రభు ఆవిర్భావ మహోత్సవాన్ని శ్రీనివాస ప్రభుజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. మహాహారతి, పుష్పాభిషేకం, సంకీర్తనలు, ప్రవచనం, మహాప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

సురభి గోరక్షా దీక్షా యాగం



చినకొత్తలంకలో సురభి గోరక్షా దీక్షా యాగం నిర్వహిస్తున్న భక్తులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం చినకొత్తలంక పట్టాభి రామస్వామి, గణపతి, విజయదుర్గమ్మ వారి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీమహి వరహా ట్రస్టు ఆధ్వర్యంలో సురభి గోరక్ష దీక్షా యాగం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ కందుకుర్తి మహికిరణ్ శర్మ ఆధ్వర్యంలో లక్ష గోపిడకలతో పది రోజుల పాటు యాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కిరణ్ శర్మ మాట్లాడుతూ మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం నుంచి అఖండ జ్యోతిని తీసుకొచ్చి హోమం ప్రారంభించామని చెప్పారు. పూజా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ పొత్తూరి ఉమారాణి, పీటీవీ వర్మ, పి.వీణారాణి, సమరసత సేవా సమితి ఫౌండేషన్ కన్వీనర్ పచ్చమట్ల సీతామహాలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు పోలీసు ఉద్యోగాలు సాధించాలి



పోలీస్ మాక్ టెస్ట్ కోసం ఈవెంట్స్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ సత్తిబాబు

అమలాపురం టౌన్: పేద విద్యార్థులను పోలీసు ఉద్యోగార్థులుగా చేయడమే శ్రీ ఎంపవర్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. శ్రీ ఎంపవర్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జరిగిన పోలీస్ మాక్ టెస్ట్‌ను సత్తిబాబు జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ మాక్ టెస్ట్ సందర్భంగా హాజరైన 150 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగరాజు, గెద్దం ప్రదీప్, తాడికోన గ్రామ సర్పంచ్ సూర్య వెంకట నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్ సంతాపం



సత్యనారాయణమూర్తి భౌతికాయం వద్ద సంతాపం తెలుపుతున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: మాజీ జెడ్పీటీసీ, విశ్రాంత ఉపాధ్యాయుడు గుబ్బల సత్యనారాయణమూర్తి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ సంతాపం తెలియజేశారు. కోడూరుపాడులోని గుబ్బలవారిపాలెంలో సత్యనారాయణమూర్తి భౌతికాయం వద్ద మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎంపీపీ ఇళ్ల శేషగిరావు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. సంతాపం తెలిపినవారిలో నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, చింతా శ్రీను, దెందుకూరి సత్తిబాబు రాజు, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల నాగరాజు తదితరులున్నారు.

ఉమర్ అలీషాను దర్శించుకున్న భక్తులు



పీఠాధిపతి ఉమర్ అలీషాను కలిసిన భక్తులు

అమలాపురం టౌన్: పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా బుధవారం సాయంత్రం అమలాపురం పట్టణం కొంకాపల్లిలోని ఓ భక్తుడి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఉమర్ అలీషాను అనేక మంది భక్తులు దర్శించుకుని ఆయన ఆశీస్సులు అందుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి సూదా గణపతి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి సప్పా నాగేశ్వరరావు, బెహరా వీర హనుమంతరావు, ఆకుల రవితేజ తదితరులు దర్శించుకున్నారు.

నేడు నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు

ఆలమూరు: మండలంలోని చింతలూరులోవ వేంచేసిన నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు గురువారం జరుగుతుంది. స్థానిక ఆలయ ఆవరణలో రామచంద్రపురం దేవస్థానం తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు ఆధ్వర్యంలో ఆలయంలోని హుండీలన్నింటికీ లెక్కింపు జరుగుతుందని ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు.